www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 22 | జూన్ | 2025
పేజీలు : 8

## ఎసిబి వలలో కంప్యూటర్ ఆపరేటర్



-రేషన్ కార్డు జారీకి రూ.2500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
-జిల్లా కలెక్టర్ దృష్టి సారిస్తే మరిన్ని వెలుగులోకి..

2లో

# మొండికేసిన మృగశిర..!





-చినుకు కోసం రైతన్న ఎదురుచూపు
-అదును తప్పుతుందన్న ఆందోళనలు
-ఎండిపోతున్న మొక్కలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మృగశిర కార్తెలో ముల్లు మెత్తబడుతుందన్నది సామెత. మృగశిరలో కురిసే వర్షాలతో రైతులు పునాస పంటలను సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది మృగశిరలో వరుణుడు మొండి కేశాడు. రోహిణికా ర్తెలో ఒకట్రెండు మంచి వర్షాలు

మిగతా 2లో..

### పేదోడికి ఇల్లు ఇచ్చిన తర్వాతే

## ఓట్లు అడగటానికి వస్తాం

-పోడుదారులను ఇబ్బందులకు గురి చేయొద్దు
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 225 కోట్లు
-పినపాక నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి/గుండాల:** అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చిన తర్వాతనే మళ్లీ ఓట్లు అడగటానికి ప్రజల వద్దకు వస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పినపాక నియోజకవర్గం పర్యటనలో భాగంగా ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు , ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాంనాయక్,

మిగతా 2లో..

## పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా



-స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టు సత్తా చాటుదాం
-సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం
-ఉత్సాహంగా సిపిఐ జూలూరుపాడు మండల మహాసభ

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు విమర్శించారు. శనివారం సిపిఐ 13వ మండల మహాసభ పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, గుండె పిన్ని మధు అధ్యక్షతన మహాసభ జరిగింది. మహాసభల ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు తూము కోటయ్య ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీం కోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31వరకు నక్సలైట్లను అంతముందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరి ఎన్కౌంటర్లు చేస్తుండటం, మరో పక్క

మిగతా 2లో..

## వృద్ధుల మానసిక సమస్యలే ప్రధాన అంశం




-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
-మమతలో రాష్ట్ర స్థాయి సైకియాట్రీ సదస్సు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వృద్ధుల మానసిక ఆరోగ్య సమస్యలే ప్రాధాన్యత అంశంగా సదస్సులో దృష్టి కేంద్రీకరించడం గర్వించదగ్గ విషయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఖమ్మం మమత ఆసుపత్రిలోని ఆడిటోరియం నందు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి మానసిక వైద్యుల సదస్సుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మనదేశ జనాభాలో వృద్ధుల నిష్పత్తి వేగంగా పెరుగుతుందన్నారు. వృద్ధుల మానసిక ఆరోగ్య సమస్యలు, ఒంటరి తనం, డిప్రెషన్, డిమోన్షియా వంటి సమస్యలు, వాటి ప్రభావం నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం మరింతగా ఉందన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మానసిక రుగ్మతల వల్ల మనిషి తీవ్ర నిరాశకు లోనై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు మానసికంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సదస్సు ద్వారా జరియాట్రిక్ సైక్రియాట్రి విభాగంలో తాజా పరిశోధనలు, చికిత్స విధానాలు, సామజిక మద్దతు, వ్యవస్థలపై మేధోమదనం జరగడం ద్వారా వృద్ధుల మానసిక

మిగతా 2లో..

# మొండికేసిన మృగశిర..!

(మొదటిపేజీ తరువాయి)

కురవడంతో రెండు మూడు రోజులు చిరుజల్లులు పడి మండువేసవిలో వర్షాకాలాన్ని తలపించాయి. వాతావరణ శాస్త్రవేత్తలు సైతం రుతుపవనాలు వచ్చేస్తున్నాయి ఈ ఏడాది ముందుగానే వర్షాలు వస్తున్నాయని అధిక వర్షాలు కురుస్తాయని పదే పదే ప్రకటనలు చేశారు. 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు పత్తి గింజలు నాటారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి గింజలు మొలకలు వచ్చాయి. 10 రోజులుగా వేసవిని తలదన్నే రీతిలో ఎండలు కాస్తున్నాయి. వడగాల్పులు వీస్తున్నాయి. ఎండ వేడిమికి మొలకెత్తిన మొక్కలు చనిపోతున్నాయి. కొందరు రైతులు పొడిన విత్తనాలు నాటారు. 10 రోజులుగా వర్షాలు లేకపోవడంతో నాటిన గింజలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునాస పంటలకు అదును తప్పుతుందని మృగశిర కార్తె పూర్తయిన వర్షాలు లేకపోవడంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, కంది, పెసర, మినుము మొదలైన పునాస పంటలకు అదును తప్పుతుంది. అదును తప్పితే దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. అతివృష్టి అనావృష్టి రైతాంగాన్ని దెబ్బతీస్తున్న తరుణంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు నీరు లేక వెలవెలపోతున్నాయి. ఖమ్మం జిల్లాలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలో 2.50 లక్షల ఎకరాలు సాగవుతుండగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా ఉంది ఈ పరిస్థితుల్లో రైతులు చినుకు కోసం ఎదురు చూస్తున్నారు.

# పేదోడికి ఇల్లు ఇచ్చిన తర్వాతే ఓట్లు అడగటానికి వస్తాం



(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పీఓ రాహుల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా గుండాల మండలం జగ్గు తండా గ్రామం నుండి లక్ష్మీదేవిపల్లి వరకు రెండు కోట్ల 50లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆళ్లపల్లి మండల పరిధిలోని ఆళ్లపల్లిలో నూతనంగా మూడు కోట్ల 35లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూరిభా గిరిజన బాలికల పాఠశాల, వసతి గృహం మరియు 82లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆల్లపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులైన బత్తిని శ్రీలత భర్త శ్రీధర్ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 227 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుండాల మండలం మామ కన్ను గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 20లక్షల నిర్మాణ వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. గుండాల మండలం లింగగూడెం గ్రామంలో చీమలగూడెం ఆర్అండ్‌బి రోడ్డు నుండి ఇప్పలగుంపు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుండాల మండలంలో చిన్న ముత్తయ్య తండ్రి మల్లయ్య ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి గుండాల మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 16 మందికి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని, పేద తల్లిదండ్రులకు వారి పిల్లలను చదివించాలని కోరిక ఉన్నప్పటికీ చదివించుకోలేని దుస్థితి గత ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అత్యాధునిక సదుపాయాలతో పేదవాడి పిల్లల భవిష్యత్తు ఆశయాలు నెరవేర్చే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది తక్కువ వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగపడిన తర్వాత కచ్చితంగా వారి యొక్క సమస్యలను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. పినపాక నియోజకవర్గంలో 4,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా వాటికై 225 కోట్ల రూపాయలను కేటాయించామన్నారు. ఇంకా మూడు విడతల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, చేసిన తర్వాతనే ఓట్లు అడగటానికి వస్తామన్నారు. పినపాక నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ఆళ్లపల్లి నుండి అనిశెట్టిపల్లి వరకు 36 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి 110కోట్ల నిర్మాణ వ్యయంతో వచ్చే నెలలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. రేగళ్ల నుండి మర్కోడు డబుల్ రోడ్డు నిర్మాణం, ఆళ్లపల్లి మండలం నుండి కొత్త వెంకటాపురం త్రీఫేస్ కరెంటు లైన్ మంజూరు చేపడతామన్నారు. ఆళ్లపల్లి కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తులు వచ్చినందున అధికారులు ఈప్రాంతంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో చూసి 100 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉంటే వెంటనే కాలేజీ స్థాపనకు చర్యలు చేపట్టవలసిందిగా కలెక్టర్‌ను ఆదేశించారు. గిరిజన ప్రాంతంలో తరతరాల నుండి పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులను అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు. పేదల కష్టం తీర్చడానికి ఏర్పడిన ఈప్రభుత్వంలో ఎంతో కాలం నుండి సాగు చేస్తున్న వారికి ఎటువంటి ఇబ్బందులు కలగా చేయవద్దని , ఏదైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారని మంత్రి తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో కంప్యూటర్ ఆపరేటర్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పేదోడికి రేషన్ కార్డు జారీ కోసం ఓ టైపిస్ట్ లబ్ధిదారుడి నుండి రూ 4వేలు లంచం డిమాండ్ చేశారు. ఈక్రమంలో లబ్ధిదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, శనివారం ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారుడి నుండి టైపిస్ట్ (కంప్యూటర్ ఆపరేటర్) సిహెచ్ నవక్రాంత్ రూ 2,500 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అయితే అవినీతికి చిక్కిన తిమింగళం చిన్న మొత్తంలోనే దొరికిందని పలువురు చర్చించుకుంటున్నారు. మరో పక్క దొరకాల్సిన వారు ఇంకా వున్నారనే వాదనలు వినిపిస్తుండటం కొసమెరుపు.

### ఈ విషయంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపిన వివరాలు ఇలా....

బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులు చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్(కంప్యూటర్ ఆపరేటర్)గా విధులను నిర్వహిస్తున్న సిహెచ్ నవక్రాంత్ బాధితుల నుండి లంచం తీసుకుంటుండగా పట్టుబడినట్లు తెలిపారు. నవక్రాంతి రేషన్ కార్డ్ ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి ప్రాసెస్ చేయడానికి గాను రూ 4వేలను లంచంగా డిమాండ్ చేశాడని, దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారన్నారు. శనివారం మధ్యాహ్నం రూ 2500 బాధితుల వద్ద నుండి నవక్రాంత్ తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెట్‌గా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈవిషయంపై కంప్యూటర్ ఆపరేటర్‌ను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఏ ప్రభుత్వ అధికారైన వారు చేయవలసిన పనులకు లంచం డిమాండ్ చేస్తే, 1064 నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమస్య ఏదైనా మీ పేరు చెప్పక పోయిన పర్వలేదు, మీ వివరాలను గోప్యంగా ఉంటాయని తెలిపారు. మీ పనులు సైతం జరిగేందుకు చట్టబదంగా చేయించడం జరుగుతుందన్నారు.

### జిల్లా కలెక్టర్ దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి....

బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరగాలంటే లంచం ఇవ్వాలనే మాటలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇదే తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటికే పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేశారు. గతంలో ఓ యూడీసీని, డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. అయితే ఇలా ఇన్ని సార్లు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ఫోన్ పే ద్వారా లంచాల అవినీతిపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అయితే పలువురు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు వారే సొంతంగా ప్రైవేట్ సిబ్బందిని నియమించుకొని వారి ద్వారా లంచాలను డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డులే కాదు, ఇలా కుల, ఆదాయ ఇలా ఏ పని చేయాలన్నా ఫోన్ పేల ద్వారా, నగదు ద్వారా లంచాలను తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరి తీసుకున్న ఈ లంచాలను ఏవరి కోసం తీసుకుంటున్నారో అనే విషయాలను సైతం పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వృద్ధుల మానసిక సమస్యలే ప్రధాన అంశం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్య సంరక్షణలో మన పాత్రను బలపర్చుకోవచ్చునన్నారు. ఆధునీక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మానసిక వైద్యం అందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. చెడు వ్యసనాలకు గురవుతున్న యువతను కాపాడాల్సిన బాధ్యత మానసిక రోగులపై ఎంతో ఉందన్నారు. ఈ రాష్ట్ర స్థాయి సదస్సు మానసిక ఆరోగ్య రంగానికి కొత్త దిశ ఆశలతో మార్గదర్శకం కావాలని పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఈ సదస్సు విజయవంతం కావడంలో మమత మెడికల్ కాలేజీ సైకియాట్రీ విభాగం, మీ అందరి సహకారం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో మానసిక వైద్యానికి సంబంధించి పలు నూతన అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ మానసిక వైద్యులు వివరించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ అశోక్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ నరేన్‌రాజ్, డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ వరప్రసాదరావు, డాక్టర్ జార్జిరెడ్డి, డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ విశాల్ ఆకుల, డాక్టర్ అనిత , పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేద వర్గాలకు ఎర్ర జెండానే భరోసా





(మొదటిపేజీ తరువాయి)

తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ఎన్కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నంటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీం కోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయితీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా మాట్లాడుతూ దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది ఎర్ర జెండానేనని, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, చంద్రుగొండ మండల కార్యదర్శి బోర కేశవులు, సిపిఐ కొత్తగూడెం నియోజకవర్గ నాయకులు నేరెళ్ల రమేష్, సిపిఐ నాయకులు ఎస్‌కే నాగుల్ మీరా, ఎల్లంకి మధు, ఎస్‌కే చాంద్ పాషా, సిరిపూరపు వెంకటేశ్వర్లు, బెజవాడ సీతయ్య, ముత్తయ్య, ఉదారి నాగయ్య, పొన్నగంటి వెంకటేశ్వర్లు, కొండ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌విఎంలో యోగా వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనివాస నగర్‌లో గల ఎస్‌విఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన యోగా వేడుకలకు డివిఎల్ ఏడి ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. యోగాసనాల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు ప్రతి రోజు యోగా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక, ధృడత్వంతో పాటు గొప్ప వ్యక్తిత్వాన్ని కలిగిస్తుందన్నారు. డైరెక్టర్ ఉమా మాట్లాడుతూ యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో యోగా డే



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 11వ అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. యోగా గురువు పర్యవేక్షణలో విద్యార్థుల చేత ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమ లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. మానసిక రుగ్మతలకు యోగా మంచి ఔషధమన్నారు. యోగా ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. మానసిక వికాసానికి, శారీరక ధృడత్వానికి యోగా తోడ్పడుతుందన్నారు. యోగా ఎందుకు జరుపుకుంటామో దాని విశిష్టత గురించి వివరించారు. చిన్న వయస్సు నుంచే యోగా నేర్చుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్న మోడీ సర్కార్




**-గిట్టుబాటు ధరలు లేకనే సంక్షోభంలోకి సాగు**
**-హామీల అమలుపై దృష్టిసారించాలి**
**-సిపిఐ నేత బాగం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** మోడీ సర్కార్ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మోడీ పాలనలో సాగు సంక్షోభంలోకి కూరుకుపోయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని సైతం కార్పోరేట్లకు కట్టబెట్టాలని కేంద్ర సర్కార్ యోచిస్తుందని ఆయన తెలిపారు. కొణిజర్ల మండలం పెద్దమునగాల గ్రామశాఖ మహాసభ పిట్టల రాంబాబు అధ్యక్షతన జరిగింది. సభలో హేమంతరావు మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటికీ 60 శాతానికి పైబడి సాగుపై ఆధారపడి జీవిస్తున్నారని పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గిపోవడం వల్లనే సాగు సంక్షోభంలోకి కూరుకుపోతుందన్నారు. రైతులకు వచ్చే సబ్సిడీలను మోడీ సర్కార్ పూర్తిగా ఎత్తివేసిందని కార్పోరేట్లకు మాత్రం ఇష్టానుసారంగా రుణాలను రద్దు చేస్తుందని హేమంతరావు తెలిపారు. రూ. 16.50 లక్షల కోట్లు కార్పోరేట్ రుణాలను రద్దు చేసిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల్లో హామీల అమలుపై నిరాశ అలుముకుంటుందన్నారు. రైతుభరోసా ప్రతి ఎకరానికి ఇవ్వడంతో పాటు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పింఛన్ల పెంపు, మహాలక్ష్మి పథకం సహా ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని హేమంతరావు కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావించి 100 ఏళ్లు గడిచిందని సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ ప్రజల విశ్వాసాన్ని చూరగొని మళ్లీ పురోగమిస్తుందని హేమంతరావు తెలిపారు. సభలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు మాట్లాడుతూ గ్రామ శాఖలు పటిష్టంగా ఉన్నప్పుడే పార్టీ త్వరిత గతిన విస్తరిస్తుందన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. అమరజీవి అచ్చెన లాలయ్య ప్రాంగణంలో జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పాపగంటి సుదర్శన్, సిపిఐ మండల నాయకులు అచ్చెన శ్రీనివాసరావు, నాయకులు దాసరి పెద్దవెంకయ్య, గంజి నర్సయ్య, టి. కోటయ్య, ఏపూరి భాస్కర్‌రావు, ఎస్. కోటయ్య, వెంకటేశ్వరరావు, తలారి పాపయ్య తదితరులు పాల్గొన్నారు. శాఖ కార్యదర్శిగా తలారి కృష్ణ, సహాయ కార్యదర్శులుగా బి. నర్సింహారావు, సుంకర రాధాకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హేమంతరావు సమక్షంలో పలువురు సిపిఐలో చేరారు.

# రైతుకు మేలు జరిగేలా చూడండి

**-రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** మార్కెట్‌కు వచ్చిన రైతులకు మేలు జరిగేలా వ్యాపారులు, అధికారులు చూడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ కోరారు. శనివారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన వ్యాపారులు, రైతు సంఘాలు, అధికారులు సమన్వయ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడానికి వచ్చిన రైతుల పట్ల సానుకూల ధోరణి అవలంభించాలన్నారు. రైతులు పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయడంతో పాటు కాటాలు, ఎగుమతుల విషయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలన్నారు. పెట్టుబడులు పెరిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్న సమయంలో గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రయత్నం జరగాలని ఆయన తెలిపారు. మార్కెట్‌కు సంబంధించి రైతులపై ఎటువంటి భారం పడకుండా చర్యలు తీసుకోవాలని రమేష్ సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ రమేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వివిధ రైతు సంఘాల నాయకులతో పాటు ఏఐటియుసి నాయకులు గాదె లక్ష్మి నారాయణ, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్లూమింగ్ మైండ్స్‌లో యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులచే యోగసనాలు వేయించారు. యోగ చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ యోగా అనే పదం సంస్కృత పదం నుండి పుట్టిందన్నారు. యోగసనాలలో ఉండే రకాల గురించి వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. యోగాతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ఎంతో విలువైనది

**-అటవీ శాఖ కార్యాలయంలో రక్తదానం**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రక్తదానం ఎంతో విలువైందని ఒక యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కళావతి బాయి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి దానికి ప్రత్యామ్నాయం ఉంది ఒక రక్తానికే ప్రత్యామ్నాయం లేదన్నారు. మనిషి బతకడానికి ప్రాణవాయువు (ఆక్సిజన్ ) ఎంత అవసరమో రక్తం కూడా అంతే అవసరమన్నారు. రక్తం శరీరంలోని ప్రతి కణంతో అనుక్షణం అనుసంధానమై ఉండే కీలక ద్రవం అన్నారు. మానవుని శరీరంలో నాలుగున్నర నుంచి ఐదు లీటర్ల వరకు రక్తం ఉంటుందన్నారు. ప్రమాదాలకు గురైన వారికి, నెలలు నిండకుండా పుట్టిన పిల్లలకు, సర్జరీ చేయించుకునే వారికి, రక్తహీనత సమస్య ఉన్న వారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుందన్నారు. ఆరోగ్య వంతమైన వ్యక్తులు 18 నుంచి 65 ఏళ్ల లోపు వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ఒక యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుందని తెలిపారు. అటువంటి చిన్నారులకు రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, రిటైర్డ్ డిఎఫ్‌వో హరిప్రసాద్, రుదిర బ్లడ్ బ్యాంక్‌కు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ చందునాయక్, డాక్టర్ నారాయణ మూర్తి, అటవీ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్ శ్రీనగర్‌లో యోగా డే




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు మాట్లాడుతూ జూన్ 21న ప్రతి ఏడాది అంతర్జాతీయ యోగా డేను నిర్వహించుకుంటున్నామన్నారు. యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ మెరుగుపర్చుకోవచ్చునన్నారు. యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగా వల్ల ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిస్పృహాలను దూరం చేసి మానసిక, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. పాఠశాలలో యోగా టీచర్‌ను ఏర్పాటు చేసి యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విద్యార్థి దశ నుంచే యోగా, మంచి ఆహారపు అలవాట్లు పాటించడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితం కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు వేయించారు.

## న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఐఏఎల్ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్ అమృత ఎస్టేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఈ ఫైలింగ్ తదితర విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్థన్, ఖమ్మం జిల్లాకు చెందిన పట్టాభి, అమర్ చంద్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరి, ఖమ్మం నగర అధ్యక్షులు జివి లక్ష్మి నారాయణ, ఎం. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**-అడిషనల్ డిసిపి ప్రసాదరావు**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రతి నిత్యం యోగాను సాధన చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మనోధైర్యం, మానసిక ప్రశాంతతను పొందవచ్చని అడిషనల్ డిసిపి లాఅండ్ అడర్ ప్రసాదరావు అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానికి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ నేతృత్వంలో యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది మనదేశంలో ఉద్భవించిన పురాతన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసన అని అన్నారు. యోగ కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని శ్వాస కూడిన వ్యాయామమన్నారు. దీని వలన మనిషిలోని ఒత్తిడిని తగ్గించి నిరాశ నిస్పృహలను దూరం చేసి ఆయుష్‌ను పెంచుతుందన్నారు. యోగా పై అవగాహన పెంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ఈసందర్భంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేసి సిబ్బంది, అధికారులతో వివిధ రకాల వ్యాయామాలను చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్మిరిజర్వ్‌డ్ అడిషనల్ డిసిపి కుమారస్వామి, ఏఆర్ ఏసిపి సుశీల్‌కుమార్, నరసయ్య, రిజర్వ్ ఇన్‌స్పెకర్లు కామరాజు, శ్రీశైలం, నాగుల్‌మీరా, సిఐలు మోహన్‌బాబు, స్వామి, శ్రీహరి, తిరుపతిరెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్‌ను తెలంగాణ రాష్ట నాయిబ్రాహ్మణ సమైక్య సంక్షేమ సేవా సంఘం కాంగ్రేస్ అనుబంధ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆ సంఘ పట్టణ, మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం వైరా పట్టణ అధ్యక్షులు కేవతవరపు నారాయణరావు, కార్యదర్శి మంచికంటి అప్పారావు, ఉపాధ్యక్షులు చిన్న ముత్తెవి, మురళీకృష్ణ, ఆ సంఘం వైరా మండల అధ్యక్షులు ఉప్పె వెంకటేష్, కార్యదర్శి కుదురుపాక భాస్కర్, ఉపాధ్యక్షులు పెడకంటి ఉదయ్‌కుమార్, ఆ సంఘ సభ్యులు కుదురుపాక సుధాకర్, నంద్యాల శ్రీనివాస్, కాంగ్రేస్ నాయకులు బోళ్ళ గంగారావు, బొగ్గుల వాసిరెడ్డి, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని అరికట్టాలి




**-నారాయణ విద్యా సంస్థలను బ్యాన్ చేయాలి**
**-నారాయణ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆందోళన**
**-విద్యార్థి నాయకులపై దాడికి దిగిన సిబ్బంది**
**-ఏఐఎస్ఎఫ్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని జమ్మిబండ రోడ్డులో ఉన్న నారాయణ విద్యా సంస్థలు అనుమతి లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. స్టేషనరీ పేరుతో బుక్‌స్టాల్ ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. అధిక ఫీజు వసూలు, బుక్స్ విక్రయంపై ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నారాయణ విద్యా సంస్థల ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు. ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై పాఠశాల ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది అసభ్య పదజాలంతో దాడికి దిగాయి. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటన స్థలంకు చేరుకుని విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం నారాయణ స్టేషనరీ గోడౌన్‌ను విద్యాశాఖాధికారులు సీజ్ చేశారని అయినా దోడ్డి దారిలో బుక్స్ అమ్మకాలు కొనసాగిస్తున్నారని తెలుసుకుని ప్రశ్నించడానికి వెళ్లిన నాయకులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. నారాయణ పాఠశాలకు ప్రైమరీ సెక్షన్‌కు అనుమతులు లేవన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖాధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థల్లో ఎస్సి, ఎస్టి, బిసి, వికలాంగులు, పేద వర్గాల విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కానీ ఎక్కడ అమలు కావడం లేదన్నారు. ఆట స్థలం తప్పనిసరిగా ఉండాలని మున్సిపాలిటీ పరిధిలో 1000 చదరపు మీటర్లు ఉండాలని నిబంధన ఉన్న ప్రైవేటు పాఠశాలలకు ఆ నిబంధనలు ఏమి పట్టవన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు తక్షణమే ప్రైవేటు కార్పోరేట్ విద్యా సంస్థలపై తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని విద్యా సంస్థలను తక్షణమే సీజ్ చేయాలన్నారు. విద్యార్థి నాయకులపై నారాయణ విద్యా సంస్థలు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మధు, కౌషిక్, మనోజ్, వినయ్, గౌతమ్, అఖిల్, నాగరాజు, నరేష్, ప్రతాప్, గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపదను దోచిపెట్టేందుకే ఆపరేషన్ కగార్ : ఏఐవైఎఫ్




**-23న ఛలో రాజ్ భవన్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశ సంపదను ముఖ్యంగా దండకారుణ్యంలో నెలకొన్న ఖనిజ సంపదను కార్పోరేట్లకు దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తుందని అఖిల భారత యువ జన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆరోపించారు. తక్షణం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ ను నిరసిస్తూ ఈనెల 23న ఛలో రాజ్‌భవన్ పిలుపుకు సంబంధించిన గోడప్రతులను అంబేడ్కర్ సెంటర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మోడీ సర్కార్ కేవలం కార్పోరేట్ల కోసమే పని చేస్తుందని వారిని మెప్పించేందుకే ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వమే నరమేధాన్ని కొనసాగించడం శోచనీయమన్నారు. బూటకపు ఎన్ కౌంటర్ల పేరిట అమాయక గిరిజనులను ఊచకోత కోస్తుందన్నారు. ప్రశ్నించే వారిని లేకుండా చేయడమే లక్ష్యంగా బిజెపి పని చేస్తుందన్నారు. మావోయిస్టుల సమస్య శాంతిభద్రతల సమస్య కాదని అది సామాజిక రాజకీయ, ఆర్థిక సమస్య అని దీనిని పరిగణలోకి తీసుకుని శాంతి చర్చలు జరపాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. నర హంతక ఉగ్రవాదులతో సైతం చర్చలు జరిపే కేంద్ర ప్రభుత్వం పేదల పక్షాన ఒక సైద్ధాంతిక నిబద్ధతతో పోరాడుతున్న మావోయిస్టులతో చర్చలు జరపకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 23న ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రామకృష్ణ యువతరానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌రాష్ట్ర సమితి సభ్యులు గణపారపు ఉపేందర్, జిల్లా నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, కొల్లి రవి, గోపి, రఫీ, రవీందర్, రాజు, వెంకన్న, విజయ్, రమేష్, సురేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యోగాతో ఆరోగ్య వంతమైన గడపవచ్చునని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా జబ్బులు తగ్గించుకోవడమే కాకుండా రోగ నిరోధకశక్తిని పెంచుకోవచ్చునని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని ఆయన తెలిపారు. ఖమ్మం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగా సెంటర్లను ఒకే వేదికపైకి తీసుకు వచ్చి ఖమ్మం యోగా ధ్యాన సమైక్యగా ఏర్పడడం అభినందనీయమన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని ఆరోగ్య, అందమైన నగరంగా తీర్చిదిద్దుదామన్నారు. ప్రతి రోజు యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. డాక్టర్ కెవై రామచంద్ర మాట్లాడుతూ ఖమ్మం నగరంలో యోగాను 40 ఏళ్ల క్రితం ఖమ్మం వర్తక సంఘంలో పరిచయం చేసినట్లు ఆయన తెలిపారు. 30 ఏళ్ల క్రితం సిద్దార్థ యోగా విద్యాలయాన్ని స్థాపించినట్లు తెలిపారు. యోగా, ఆహారపు నియమాలు పాటించి క్యాన్సర్‌ను జయించిన పాషాను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కాసిన ఆనందప్రసాద్ స్వాగతం పలుకగా సభాధ్యక్షులుగా వంజాకుల లక్ష్మినారాయణ వ్యవహరించారు. డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, ఆయూష్ శాఖ జిల్లా అధికారి డాక్టర్ పద్మావతి, డిఎస్‌డివో సునీల్ రెడ్డి, డాక్టర్ కనకమహలక్ష్మి, వర్తక సంఘం అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, వివిధ యోగా సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా యోగా గురువులు, స్పాన్సర్లను మెమోంటోలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

## నూతన కమిటీ ఎంపిక

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక శివముత్యాలమ్మ తల్లి ఆలయంలో శనివారం నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా ఉంగరాల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వెంకట్, గౌరవ అధ్యక్షులుగా హరిచంద్రనాయక్‌తో పాటు మరికొందరితో నూతన కమిటి ఏకగ్రీవమైంది. గౌరవ సలహాదారు తుమ్మలపల్లి ధనేశ్వరరావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర గల ఈ ఆలయాభివృద్ధికి హరిచంద్రనాయక్ ఎంతో కృషి చేశారని చెప్పారు. రానున్న రోజుల్లో శక్తివంచన లేకుండా ఆలయాభివృద్ధికి కమిటీ సభ్యులసహకారంతో ప్రధానభూమిక పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.సత్యం, చిట్టినీడి రామలింగేశ్వరరావు, బోళ్ల వెంకట్రావు, రవికుమార్, బండారు శరత్, సత్యనారాయణ, ప్రభాకర్, రమణారెడ్డి, రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానం ఆవరణలో యోగా డే



**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి రాజగోపాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్, వైస్ ప్రెసిడెంట్ మోత్కూరి విజయ శాంత, పొన్నెకంటి నర్సింహారావు, పలువురు న్యాయ మూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో యోగా డే



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో యోగాసనాలతో జోష్ నెలకొంది. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పలు రకాల యోగాసనాలు చేస్తూ అబ్బురపరిచారు. 12 రకాల సూర్య నమస్కారాల భంగిమలు చేశారు. ఈ సందరర్భంగా కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య యోగా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచానికి మన దేశం అందించిన గొప్ప బహుమతి యోగా అని తెలిపారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. యోగాసనాలపై శారీరక ధృడత్వం, ప్రాణమయం, ధ్యానంతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**ప్రజాపక్షం/ మధిర :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మధిర పట్టణంలో శనివారం యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మధిర సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి ఎన్.ప్రశాంతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, న్యాయవాదులు యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ యోగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ఒక దిక్సూచిలా మార్చడం భారతీయులందరికీ గర్వకారణంగా పేర్కొన్నారు. యోగాసనాలు ప్రతిరోజు వేదయం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఎటువంటి రోగాలు దరిచేరనీయకుండా కాపాడుకోవచ్చునని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మధిర వారి ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యోగా సాధకులు, గూరూజీ నాళ్ళ శ్రీనివాసరావుచే యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గురూజి నాళ్ళ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన కల్పిస్తూ యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ ప్రముఖులు, ప్రముఖ వ్యాపారవేత్త కోన జనార్ధన్‌రావు సతీమణి కోన పార్వతీదేవి జన్మ దినం సందర్భంగా ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో మతిస్థిమితం లేని మానసిక వికలాంగులకు శనివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్కేఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న కోన పార్వతీదేవికి అభినందనలు తెలిపారు. కోన దంపతులు ఆర్కే ఫౌండేషన్‌కు అందిస్తున్న సహాయ సహకారాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఖానాపురంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

**పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం ఖానాపురంలో ఎన్‌టిఆర్ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా నన్నూరు నర్సిరెడ్డి, వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ హాజరయ్యారు. అనంతరావు ఎన్‌టిఆర్ విగ్రహాన్ని కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని దేశానికి చాటిచెప్పిన నాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రామనాథం, కొరబాడు వెంకటేశ్వర్లు, కనగాల సాంబశివరావు, కరుణాకర్, మల్లంపేట అప్పారావు, కొత్తా సీతయ్య, మందపల్లి రజిని, చుండు రాష్ట్ర, రాష్ట్ర తెలుగు మహిళా కోర్టు సత్యావతి, మేడేపల్లి రాణి, తెలుగు యువత మండల అధ్యక్షులు పత్తిపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అబ్బాస్ మృతికి పువ్వాడ నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ ఖమ్మం నగర యువజన విభాగం నాయకుడు అబ్బాస్ మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన అబ్బాస్ జనాజ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని అబ్బాస్‌కు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అబ్బాస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అబ్బాస్ కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మగ్బూల్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఖమర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు. అబ్బాస్ మృతి పట్ల ఎంఎల్‌సి, బిఆర్ఎస్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ నివాళులర్పించారు. అబ్బాస్ భౌతికాయాన్ని ఎంఎల్‌సి తాతా మధు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

# పోడు వ్యవసాయం ఆదివాసీల హక్కు

**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/కొత్త గూడెం టౌన్ :** అడవులనే నమ్ముకొని పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వలస ఆదివాసీల భూములను లాక్కొని వారికి ఉపాధి లేకుండా చేయొద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని, అటవీశాఖ అధికారులను కోరారు. చుంచుపల్లి మండలం, పెనగడప పంచాయతి అటవీ ప్రాంతంలోని జగ్గారం, పాలవాగు, గడ్డిగుట్ట, జగ్గారం, మర్రిగూడెం ఆదివాసీ గూడేలను శనివారం అయన సందర్శించిన అనంతరం జగ్గారం గ్రామంలో అటవీశాఖ, ఆదివాసీ కుటుంబాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాబీర్ మాట్లాడుతూ, దశాబ్దాల క్రితం బ్రతుకుదెరువుకోసం ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చిన ఆదివాసీ కుటుంబాలు పెనగడప శివారులో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని పోడు వ్యవసాయంపై జీవిస్తున్నారని, వీరికి అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములపై హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, జిల్లా అధికార యంత్రాంగంపై ఉందన్నారు. చట్టం ప్రకారం ఒక్కో కుటుంబం తొమ్మిది ఎకరాలలోపే పోడు సాగుచేసుకొని జీవిస్తున్నారని, అటవీ శాఖా అధికారులు వీరిని పోడు నుంచి దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో వీరు సాగుచేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవడంతో మిగిలిని భూమిని నాలుగు గ్రామాలకు చెందిన 200 ఆదివాసీ కుటుంబాలు సాగుచేసుకొని జీవిస్తున్నారని, ఈ భూమిని సైతం లాక్కునే ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. భూములలు లాక్కునే ప్రయత్నాలు మానుకొని స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే వెసులుబాటు కల్పించాలని, పోడు పట్టాలు మంజూరు చేయాలనీ కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు నీడలా సుధాకర్, మన్నెం వెంకన్న, కట్టా ఉదయ్, తాజుద్దీన్, కుంచం శ్రీనివాసరావు, మూతి శ్రీనివాస్, దస్తగిరి, ఖాసీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కరానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సిసి రోడ్లు, డ్రైనేజిలు, పాఠశాలల ప్రహరీ గోడలు, అంతర్గత రహదారుల విస్తరణ, గ్రామీణ విద్యుత్ సరఫరా, విద్యుత్ లైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రూ.12వేలు పెట్టుబడి సాయం, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థులకు మెరుగైన విద్య తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీరాజ్ డిఇ శ్రీధర్, ఎఈ అక్షిత్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డి సలీం, ఎఇ సతీష్, మండల మాజీ అధ్యక్షులు తుమ్మా రాంబాబు, మండల నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, ఫణి, మిండ హరి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం






**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** భారత ప్రభుత్వము కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాడు సింగరేణి ప్రధాన కార్యాలయము నందు అధికారులు ఉద్యోగులు అందరితో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. జిఎం పర్సనల్ వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ డైరక్టర్ ఈఎం డి.సత్యనారాయణ రావు, విశిష్ట అతిథులుగా జిఎం సేఫ్టీ సిహెచ్.శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ ఏ.హరి ప్రసాద్ గార్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో జిఎం స్టోర్స్ పి.ఎలిశా, డిజిఎం పర్సనల్ లు కేసా నారాయణ, బి.శివ కేశవ రావు, ముకుంద సత్య నారాయణ, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు, యోగా మాస్టర్లు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా అవసరం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా అవసరమని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు సూచించారు. మండలం లోని వివిధ గ్రామాలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో యోగా డే ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు యోగా ఆసనాలు చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగా అనేది ఖర్చు లేని మందు అని అన్నారు. ఇది మానసిక వికాసానికి దోహదపడుతుందని అన్నారు. శరీరం, మనస్సు మధ్య సమతుల్య సాధన కు యోగా అద్భుతంగా తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. పలు చోట్ల జరిగిన యోగా కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మరియు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రభుత్వ హస్పిటల్ ను పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు అవసరమైన పరికరాల గురించి ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ. ప్రభుత్వ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్.మంగ్ల తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల కేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 14వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ ఉద్యమ నాయకులు షేక్ నబీ సాహెబ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సేవలను కొనియాడుతూ ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు అధికారంలోకి ఉండి కూడా తెలంగాణ ఉద్యమంలో వాడుకొని వదిలేసి అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ ఉద్యమకారులకు తన మేనిఫెస్టోలో ఉన్నో హామీలు ప్రకటించి అమలు విషయంలో మాత్రం తీవ్రమైన జాప్యం చేస్తుందన్నారు. ఇకనైనా తెలంగాణ ఉద్యమకారుల విషయంలో జాప్యం చేయకుండా వెంటనే తన మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నూనావత్ రమేష్, దొంతుల సత్యం, సున్నం రామకృష్ణ, జరుపుల రవి, కొయ్యల పెద్ద పుల్లయ్య, బేబీనేని వీరయ్య, అబ్దుల్ రహీం, కొండ్రు భాస్కర్, దుబ్బా సురేష్, బానోత్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ఇల్లెందు:** పట్టణంలోని పాఠ్యపుస్తకాల వ్యాపారులు అధిక ధరలను వడ్డిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను దోచుకుంటున్నారని వారిపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.సాయి, ఎ.పార్థసారథి డిమాండ్ చేశారు. ఈమేరకు మండల విద్యాశాఖ అధికారి ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నర్సరీ నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ నిబంధనలు తుంగలోతొక్కి ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూళ్లు చేస్తూ పేదప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎటువంటి రశీదులు లేకుండా అక్రమంగా ఇష్టానుసారమైన ధరలను నిర్ణయించుకుని విద్యార్థులను, తల్లిదండ్రులను దోచుకుంటున్నారని, వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గంగాధరి గణేశ్ పాల్గొన్నారు.

# నిరుపేదలకు మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట రెవెన్యూలో ఉన్న 1228 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆధ్వర్యంలో సుమారు మూడు సంవత్సరాలుగా 130కుటుంబాల పేద బడుగు ప్రజలు ఇళ్ళు నిర్మించుకుని నివసిస్తున్నారని, వారికి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ నాయకులు అధికారులను కోరారు. శనివారం ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆర్ఐ తాటి కృష్ణతో సందర్శించి వినతిపత్రం అందచేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, రెవెన్యూ అధికారులు, పాలకులు స్పందించి పేద ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తారని సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం, సిపిఐ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన అవసరం

**-ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ రామచంద్ర**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరికి యోగా సాధన ఎంతో అవసరమని ప్రకృతి వైద్య నిపుణులు, అబ్దుల్ కలాం అవార్డు గ్రహీత డాక్టర్ రామచంద్ర తెలిపారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సిద్దార్థ యోగా విద్యాలయం యోగా మాస్టర్ కోదండరావు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధనలో పెద్ద సంఖ్యలో యోగా ప్రేమికులు పాల్గొన్నారు.ఈ సందర్బంగా డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ యోగా అనేది భారతీయ సంస్కృతి మనకు అందించిన గొప్ప వరమన్నారు. సిద్దార్థ యోగా విద్యాలయం ద్వారా గత 20 ఏళ్లుగా నాలుగు రాష్ట్రాల్లో 72 సెంటర్ల ద్వారా నిర్వహిస్తున్న యోగా ఆరోగ్య కార్యక్రమాల పట్ల సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ సిద్దార్థ యోగా విద్యాలయ నిర్వాహకుల యోగా ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. నిత్యం



మానసిక ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దార్థ యోగా విద్యాలయ నిర్వాహకులు లక్ష్మినారాయణ, కృష్ణమూర్తి, వెంకన్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసం పత్రికలు పనిచేయాలి : ఎస్‌ఐ





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** సమాజంలో అన్ని రంగాల్లో కన్నా పత్రికారంగం ఎంతో విలువైందని పత్రికలు ద్వారా సమాజం ఎంతో మార్పు చెందుతుందని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పత్రికలు విలేకరులు సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. తిరుమలాయపాలెం నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక ఇటీవల జరుగగా కేశవాపురం రోడ్‌లోని అనూష గార్డెన్లో శుక్రవారం జరిగిన పరిచయ వేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీనాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మొదటగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పసలాది సత్యనారాయణ, కార్యదర్శిగా కొప్పుల శ్రీనివాసులు అతిథులు ఘనంగా సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు కూడా ముఖ్య అతిధులందరినీ శాలువతో పుష్పగుచ్చాలతో సత్కరించారు. పరిచయ వేదిక కార్యక్రమాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పసలాది సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించగా పత్రికలో పనిచేసుకుంటూ మృతి చెందిన పదముత్యం కాంతయ్యకు, దోనెపల్లి వెంకన్నకు మౌనం పాటించారు. అనంతరం జరిగిన సభలో ఎస్సై కూచిపడి జగదీష్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పత్రికలు విలేకరులు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పత్రికల్లో వార్తలు ప్రచురణ కావాలని ఆయన అన్నారు. సమాజంలో పత్రిక విలేకరులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అలాంటి పవిత్ర వృత్తిలో పనిచేసే వారు ప్రజలను చైతన్య పరిచే విధంగా వార్తలు ఉండాలని, ముఖ్యంగా యువత పెడదారి పట్టకుండా చదువుపై దృష్టి సారించి వారి బందారు భవిష్యత్‌కు బాటలు వేసే విధంగా పత్రికలు చైతన్యపర్చాలని అన్నారు. కమిటీ సభ్యులంతా ఐక్యంగా ఉండి మండల సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, ఎఓ నాగిరెడ్డి సీతారామరెడ్డి, ఎంపిఓ సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల నాయకులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంతా డివిజన్ నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి గొర్రె పాటి రమేష్, తెలుగుదేశం జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తిలో ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో విజన్ టెక్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆన్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు బీటెక్ చివరి సంవత్సరం అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విద్యార్థులు సుమారు 152 మంది హాజరయ్యారని కళాశాల ట్రైనింగ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా. డియన్ వి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్ విజన్ టెక్ అకాడమీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ హైదరాబాద్ కంపెనీ ప్రతినిధులు యం.వంశీ కృష్ణ కోఫౌండర్ నీల్ కమల్ సీనియర్ హెఆర్ మేనేజర్, కె.రాజ్ లక్ష్మి హెచ్ ఆర్ జనరలిస్ట్, యన్.రీతిక బిడిఏలు నిర్వహించారు. ఈ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ను రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించి మొత్తం 12మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్ లో బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ గా ఉద్యోగం చేయవలసి ఉంటుందని, ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు జీతం సంవత్సరానికి రూ.3,50,000 నుండి 8లక్షల వరకు ఇవ్వటంతో పాటు టిఏ, డిఏ నివాసయోగ్యమైన క్వార్టర్స్ ఇవ్వటం జరుగుతుందని యం.వంశీకృష్ణ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి.శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం పలు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులను ఒడిసి పట్టుకునేందుకు అనుసరిస్తున్న విధానమే క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లు, క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ పరంగా ఇప్పుడు యువత ముందు ఎన్నో అవకాశాలు మరెన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా.బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి.అన్విద, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డిలు వర్చువల్ గా మాట్లాడారు.

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో యోగా అంతర్భాగం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో యోగా అంతర్భాగమన్నారు బిజేపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు. శనివారం పట్టణంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు పాల్గొని విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో యోగా అంతర్భాగమని, మరుగున పడుతున్న మన యోగ విద్యకు నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాత అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఈ రోజు ఐక్యరాజ్యసమితి కూడా యోగాను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా యోగ దినోత్సవం నిర్వహించే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, చైతన్య స్కూల్ డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది, బిజేపి పట్టణ అధ్యక్షులు బానోతు విజయ్, మండలాధ్యక్షుడు సాలి శివకృష్ణ, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి మందార శివ, పట్టణ కార్యదర్శి కార్తీక్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ మెరుగు శేషగిరిరావు, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, వేంసూరు మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, ఉబ్బల కృష్ణ, చీకటి వసంతరావు, బట్టా సాయి తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఘనంగా యోగా డే



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. యోగా డే సందర్బంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యోగా శిక్షకులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యురాలు మమత, విద్యార్థులు, ఉపాధ్యాయులచే సూర్య నమస్కారాలు, ప్రాణయమం, వివిధ ఆసనాలను, ధ్యానం తదితర వాటిని సాధన చేయించారు. ఈ సందర్బంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ యోగా వల్ల మానవ మేధస్సు, శారీరక, మానసిక ధృడత్వం కలిగి ఉన్నతంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారతీయ యోగా శాస్త్రం ప్రపంచానికి జీవన మార్గాన్ని నిర్దేశించిందన్నారు. వారం రోజులుగా పాఠశాలలో విద్యార్థులకు యోగా ట్రైనర్ల ఆధ్వర్యంలో యోగాసనాలను నేర్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆసనాలపై పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, ఛార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కార్యాలయాలలో ప్రపంచ యోగా దినోత్సవం ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు మౌనిక ఆరోగ్య సిబ్బందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె అవగాహన కల్పిస్తూ యోగా వలన ఉల్లాసం, ఉత్సాహం కలుగుతుందని శరీర దారుడ్యానికి అవకాశం కల్పిస్తూ బీపీ షుగర్‌లో అదుపులో ఉంచడానికి ఉపయోగకారిగా ప్రతి రోజు ప్రతి వ్యక్తి ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె వివరించారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా యోగా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రి కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని 15వ ప్రత్యేక పోలీస్ పటాలము బి.గంగారం, సత్తుపల్లి నందు శనివారం ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పటాలపు కమాండెంట్ ఎన్.పెదబాబు,హార్ట్ ఆఫ్ లివింగ్ సంస్త నుండి వెంకట్ రెడ్డి , వెంకట్ , సత్తుపల్లి విశ్వశాంతి స్కూల్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, పాఠశాల విద్యార్దులు పాల్గొని ప్రస్తుతం సమాజంలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్బంగా యోగా వలన శారీరకంగా,మానసిక ఉల్లాసంగా ఉండేందుకు ఎంతగానో ధోహదపడుతుందని వివరించారు. ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పటలపు అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.డి.రంగారెడ్డి, పటాలపు ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు పటాలపు అధికారులు,సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మనిషి జీవితానికి యోగ ఎంతో దోహదం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మనిషి ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో ఉపయోకరంగా దోహదపడుతుందని పలవురు వక్తలు అన్నారు. మండల పరిధిలోని కాకరవాయి ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో నందు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై విద్యార్దులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్దులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా హోమియో వైద్యశాల సిబ్బంది దాస్ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని, మనిషి ఏకాగ్రత మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవితం గడుపుతామని తెలిపారు. యోగాతో మనిషి ఆయుష్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పి.వెంకట్ రెడ్డి, యోగా శిక్షకురాలు పి.అరుణకుమారి, ఆయుర్వేద సిబ్బంది, పాఠశాల హెచ్ఎం శంకర్రరావు, ఫిజికల్ డైరెక్టర్ సైదులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయు, విద్యార్దులు పాల్గొన్నారు.

# శ్రీ ఆదర్శలో యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ చింతకాని :** మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని శ్రీ ఆదర్శ విద్యాలయ కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో యోగా విశిష్టతను తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్బంగా కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు యోగా జ్ఞాన సంపద ఎంతో అవసరమన్నారు. యోగా వల్ల ఉపయోగాలను వివరించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు జొన్నలగడ్డ శ్రీనివాస్, అమరబోయిన సురేష్, పార్వతి, నాగదుర్గ, త్రివేణి, శైలజ, చందన, సుజాత, ప్రశాంతి పాల్గొన్నారు.